

అల్లూరికి ఘన నివాళి

అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా జిల్లాపోలీసు కార్యాలయంలో అల్లూరికి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, పోలీసు అధికారులు మన్యం వీరుడిని స్మరించుకున్నారు. -శ్రీకాకుళం క్రైమ్



స్కూల్ ఆటో బోల్తా

దేశవానిపేట సమీపంలో స్కూల్ ఆటో బోల్తా పడింది. ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. -8లో

సజావుగా బదిలీల కౌన్సెలింగ్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో దాదాపు 97 మంది కానిస్టేబుళ్లు, హెచ్‌సీలకు బదిలీ కౌన్సిలింగ్ ప్రక్రియ శుక్రవారం సాఫీగా జరిగింది. ఐదేళ్లు నిండిన వారే కాక 3, 4 ఏళ్ల సర్వీసు వాళ్లు, సీ-నంబర్ ఉన్నవాళ్లు వీరిలో ఉన్నారు. గురువారం రాత్రి జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పిలుపు రావడంతో అంతా తటపటాయిస్తూనే శుక్రవారం ఉదయం కార్యాలయానికి చేరారు. ఎక్కడకు వేసేస్తారో అని భయపడుతుండగా.. దగ్గర దగ్గర మండలాల్లోని పీఎస్‌ల్లో తమకు నచ్చిన విధంగా వేయడంతో కాస్త ఉపశమనం పొందారు.

న్యూస్‌రీల్

‘రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో’ విజయవంతం చేద్దాం



నరసన్నపేట: పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ‘రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో’ కార్యక్రమం జిల్లాలో జయప్రదం చేయాలని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలో గురువారం జరిగిన సమీక్ష సమావేశం విజయవంతమైందని అన్నారు. అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు ఇతర ప్రధాన నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అయ్యేంత వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో 75,566 ‘బంగారు కుటుంబాలు’ గుర్తింపు


శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పీ–4 కార్యక్రమంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్షకు జిల్లా నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సహా పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు. జిల్లాలో మొత్తం 75,566 బంగారు కుటుంబాలు గుర్తించినట్లు వెల్లడించారు. వీటిలో ఇప్పటివరకు 181 కుటుంబాలను దత్తత తీసుకున్నారని, ఇంకా 75,385 కుటుంబాలు దత్తత కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీలోపు 59,124 కుటుంబాల దత్తత లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు ముమ్మరం చేశామని అన్నారు.

‘దళిత వ్యక్తిని సీఎం చంద్రబాబు కుక్కతో పోల్చడం దారుణం’




ఎస్‌ఐ హరికృష్ణకు చంద్రబాబుపై ఫిర్యాదు చేస్తున్న జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం సభ్యులు

శ్రీకాకుళం క్రైమ్ : ప్రమాదంలో మరణించిన ఓ దళిత వ్యక్తిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుక్కతో పోల్చడం దారుణమని, చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు ముంజేటి కృష్ణమూర్తి, సభ్యులు శుక్రవారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా సింగయ్య అనే వ్యక్తి మృతిచెందారని, కానీ దళితుడనే చిన్నచూపుతో ఓ ముఖ్యమంత్రి ఇలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



నరుబుజ్జిలి మండలం చిన కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనంలో తేలిన పురుగుల చిత్రమిది.

నరుబుజ్జిలి మండలం చిన కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం వండేందుకు బియ్యం సిద్ధం చేస్తుండగా ముక్కిన బియ్యంలో బయటకు వస్తున్న పురుగుల చిత్రమిది. వీడియో కూడా చూడవచ్చు.







సోంపేట మండలం బారువ ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థుల భోజనం కోసం సిద్ధం చేసిన బియ్యంలో బయట పడ్డ పురుగులివి. ఈ విషయాన్ని అక్కడి అధికారులు జిల్లా అధికారుల దృష్టికి కూడా తీసుకొచ్చారు. దానికి సంబంధించిన వీడియోను రెవెన్యూ అధికారుల గ్రూపులో పోస్టు చేశారు.

* వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కవిటి మండలం నెలవంక ప్రాథమిక పాఠశాలకు సరఫరా చేసిన మధ్యాహ్నం భోజనం పథకం బియ్యం అట్టకట్టేసిన దృశ్యమిది. రెండు బ్యాగులు తెరి చూస్తే రెండింటిలోను అట్టలు కట్టేసి ఉంది. దానికి సంబంధించిన వీడియో కూడా చూడొచ్చు.



మిథ్యాహ్న భోజనం

సన్న బియ్యం అన్నారు.. పురుగులన్నం పెడుతున్నారు..!

- మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం బదులు సన్నని బియ్యం
- పాఠశాలలు, హాస్టల్స్‌కు మిల్లు మేడ్ బియ్యం సరఫరా
- అట్టకట్టేస్తున్న బియ్యంలో పురుగులు
- మార్కెట్‌లో చెల్లని బియ్యానికి పాలిష్ చేసి విద్యార్థులకు పెడుతున్నట్టు ఆరోపణలు
- తినలేక ఇబ్బంది పడుతున్న పిల్లలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:



తినలేక వెంటనే పారబోస్తున్న విద్యార్థిని

అట్టకట్టేసిన బియ్యం.. తీసి చూస్తే అంతా పురుగుల మయం.. వండితే అనారోగ్యం.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్న తీరు ఇది. అసలు ఇలాంటి బియ్యాన్ని పాఠశాలలకు పంపించడం నేరం కాదు పాపం. ఇది ఏదో ఒక పాఠశాలలోనో.. ఒక మండలంలో కాదు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. కళ్ల ముందు కనిపిస్తున్న పురుగుల బియ్యాన్ని పిల్లలకు ఎలా పెట్టగలమని ఉపాధ్యాయులు కూడా బాధ పడుతున్నారు. బయటకు చెబితే ఎక్కడ టార్గెట్ అయిపోతామో, ఏ రకంగా ఇబ్బందులు ఎదుర్కొంటామోనన్న భయంతో లోలోపల కుంగిపోతున్నారు. జరుగుతున్నదంతా అధికారుల దృష్టికి అంతర్గతంగా తీసుకెళ్లినా మార్పు కనిపించడం లేదు. అధికారుల గ్రూపుల్లోనే ఈ పురుగుల బియ్యం వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. పురుగులు కనిపించిన బ్యాగుల స్థానంలో మరో బ్యాగు పంపిస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదు. అక్రమార్కులకు కొంతమంది అధికారులు సహకరించడంతో జిల్లాలో పాడై ఉండిపోయిన బియ్యాన్ని సన్నబియ్యం ముసుగులో విద్యార్థులకు పెడుతున్నట్టు అనుమానాలు ఉన్నాయి.

ఇది నేరం కాదా..?

ఇది కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసం. ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్స్‌లో, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో విద్యార్థులకు సన్న బియ్యం భోజనం పెడుతున్నామంటూ పురుగుల భోజనం పెడుతున్న పరిస్థితి నెలకొంది. మిల్లు మేడ్ సన్నబియ్యం పెట్టి విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకుంటోంది. దొడ్డు బియ్యాన్నే సన్నబియ్యంగా చెప్పుకుని మభ్యపెడుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ముక్కివాసన, పురుగుల భోజనం తినలేక పాఠశాలల్లో కొందరు పిల్లలు వెంటనే పారబోస్తుండగా, హాస్టల్స్, ఇతరత్రా వాటిలో మసిపూసి మారేడు కాయ చేసి పెడుతుంటంతో తప్పక తినాల్సి వస్తోంది.

చెల్లని బియ్యానికి పాలిష్ మెరుగులు

అధికారులు తెనాలి నుంచి తీసుకొచ్చిన బియ్యాన్ని సింగన్నపాలెంలో ప్యాకింగ్ చేసినప్పుడు ఎదురైన సమస్యలతో ముక్కివాసన, పురుగులు వస్తున్నాయని చెబుతున్నప్పటికీ అదంతా అవాస్తమని ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన పెద్దల గోడౌన్‌లో నిల్వ ఉన్న బియ్యానికి మూడు పాలిష్‌లు పెట్టి సన్నబియ్యంగా తోసేస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. పెద్దల మిల్లుల నుంచి మార్కెట్‌లోకి వెళ్లని నాసిరకం రైస్ అంతటిని, ప్లేట్ ఎడ్జస్ట్‌మెంట్ చేసి, ఫైన్ రైస్ సైజుకు కటింగ్ చేసి వదులుతున్నట్టుగా తెలుస్తోంది. చెత్త రకానికి చెందిన బియ్యానికి చట్టబద్ధత కల్పించడానికి క్యూ ఆర్ కోడ్ ఇచ్చి, స్కాన్ చేసి బ్యాగులు సరఫరా చేస్తున్నట్టుగా ప్రభుత్వం బిల్డప్ ఇస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల బొద్దింకలు, ఇతరత్రా పురుగులతో కూడిన భోజనం ఘటనలు బయటికొచ్చాయి. జిల్లాలో ఇప్పటికే పలు చోట్ల విద్యార్థులు ఈ భోజనం తినలేక ఇళ్ల దగ్గరి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్నారు.

పోర్టిఫైడ్ రైస్‌కు మంగళం పాడేసి

విద్యార్థుల్లో పోషకాహార లోపాలను తగ్గించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం పోర్టిఫైడ్ రైస్ అందించేది. క్వాలిటీ రైస్ కావడంతో పిల్లల ఆరోగ్యానికి దోహదపడేది. ఇప్పుడీ ప్రభుత్వం పోర్టిఫైడ్ రైస్‌కు మంగళం పాడేసి సన్నబియ్యం పేరుతో మిల్లు మేడ్ సన్నని బియ్యాన్ని అందిస్తోంది.

చక్కదిద్దుతున్నాం

తెనాలి నుంచి బియ్యం వచ్చింది. సింగన్నపాలెంలో ప్యాక్ చేస్తున్నాం. అక్కడ కన్జెస్టడ్‌గా ఉంది. దాని వల్ల ఇబ్బందులు ఉన్నాయి. చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆదేశాలిచ్చాం.

– వేణు, సివిల్ సప్లయిస్ డిస్ట్రిక్ట్ మేనేజర్

ఆ రెండు హత్యలు చేసింది ఒక్కడే

- హత్యకు దారి తీసిన అక్రమ సంబంధం
- లొంగిపోయిన నిందితుడు
- వివరాలు వెల్లడించిన కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు



వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, పోలీసు అధికారులు

కాశీబుగ్గ: అక్రమ సంబంధం రెండు హత్యలకు దారితీసింది. నిందితుడే లొంగిపోవడంతో కేసు కొలిక్కి వచ్చింది. కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు శుక్రవారం కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి పలాస మెజిస్ట్రేట్ కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

మే 17న సోంపేట మండలం పాలవలస బైపాస్ రోడ్డు పక్కన ఉన్న జీడి తోటల్లో గోకర్ల ఈశ్వరరావు అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. దీనిపై బారువ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఓ వైపు ఈ కేసు దర్యాప్తు జరుగుతుండగా పాలవలస అత్తవారింటిలో ఉంటున్న గోకర్ల రాజేశ్వరి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఆమె తండ్రి మందస పోలీసులకు గత నెల 13న ఫిర్యాదు చేశారు. దీనిపై మందస పోలీసులు దర్యాప్తు జరిపి, గత నెల 15న అదే మండలం పితాళి గ్రామ పరిధిలోని జీడి తోటల్లో రాజేశ్వరి మృతదేహాన్ని కనుగొన్నారు. ఈ రెండు హత్యలు జీడితోటల్లోనే జరగడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు సాగించారు.

హత్యకు గురైన రాజేశ్వరి భర్త చంద్రశేఖర్ కూలి పనుల కోసం సౌదీలో ఉంటున్నారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాశీబుగ్గ డీఎస్పీ స్పెషల్ టీమ్‌ను రంగంలోకి దించారు. ఈ టీమ్ దర్యాప్తు ప్రారంభించగా పలాస మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన మడియా రామారావు తరచూ రాజేశ్వరి ఇంటికి వెళ్లి వస్తున్నట్లు గుర్తించారు. ఈయన చంద్రశేఖర్ సోదరి భర్త. అంటే రాజేశ్వరికి వరుసకు అన్నయ్య అవుతాడు. అలాగే పాలవలస జీడితోటలో హత్యకు గురైన ఈశ్వరరావు రాజేశ్వరికి వరుసకు బావ అవుతాడు. అతడు రాజేశ్వరి ఇంటి ఎదుటే ఉండేవాడు. రామారావుతో పాటుగా ఈశ్వరరావుతోనూ మృతురాలికి వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం రామారావుకు తెలియడంతో ఈశ్వరరావును చంపేందుకు పథకం పన్నాడు. పాలవలస గ్రామ సంబరాలు జరిగే సమయంలో ఈశ్వరరావు, రామారావు ఇద్దరూ రోడ్డు పక్కనున్న జీడి తోటలో మద్యం సేవించారు. తర్వాత బీరు బాటిల్‌తో ఈశ్వరరావుని అతి కిరాతకంగా రామారావు హత్య చేశాడు. తర్వాత రాజేశ్వరిని కూడా హతమార్చేందుకు ప్రణాళిక వేశాడు. గత నెల ఒకటో తేదీన రాజేశ్వరి పాలవలస వెళ్లేందుకు హరిపురంలో బస్సు ఎక్కి రాణిగాం బస్టాప్ వద్ద దిగిపోయింది. అదే సమయంలో అక్కడకు ద్విచక్ర వాహనంపై రామారావు చేరుకొని ఆమెను బండి ఎక్కించుకొని పితాళి గ్రామ పరిధిలో గల తోటల్లోకి తీసుకువెళ్లి చున్నీతో పీక నులిమి చంపేసి ఒంటిపై ఉన్న బంగారు నగలు దోచుకున్నాడు. నిందితుడు గురువారం పితాళి గ్రామ వీఆర్‌ఓ వద్ద లొంగిపోయాడు. పోలీసులు విచారించి ఆధారాలు సేకరించారు.

జాతీయ లోక్ అదాలత్‌కు సిద్ధం కావాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో న్యాయ సేవల విస్తరణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చర్యలు వేగవంతం చేసిందని, జూలై 5న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ప్రజలు రాజీ సాధనకు ముందుకు రావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పిలుపునిచ్చారు. ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయ సేవల లక్ష్యాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై వివరించారు. న్యాయ వ్యవహారాల్లో కక్షిదారులు, న్యాయవాదులు పరస్పర సహకారంతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ప్యానెల్ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

అడవి బిడ్డలంటే అలుసెందుకు..?



రేషన్ మోసుకుంటూ వస్తున్న గిరిజనులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొండదారులగుండా గిరిజనుల కష్టాల ప్రయాణం



ఆరు కిలోమీటర్ల దూరంలో రేషన్ డిపో.. రవాణా సదుపాయాలు అంతగా లేని గిరిజన గ్రామాలు.. దారంతా వాన. రేషన్ బియ్యం కావాలంటే పనులు మానుకుని అంతదూరం వెళ్లాలి. వేలి ముద్ర పడకపోయినా, నెట్‌వర్క్ అందకపోయినా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాలి. పొద్దున్న డిపోకు వెళ్తే ఏ మధ్యాహ్నానికో గానీ బియ్యం అందదు. తిరుగు ప్రయాణంలో కాసింత వర్షం పడినా.. బియ్యమంతా తడిచిపోతుంది. కొత్తూరు మండలంలోని గొట్టిపల్లి డిపో పరిధిలో గిరిజనుల కష్టాలివి. రేషన్ వాహనాలు రద్దు చేయడమే పెద్ద విజయంగా భావిస్తున్న కూటమి సర్కారుకు ఇలాంటి గిరిజనుల కష్టాలు కనిపించడం లేదు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం ఆ గిరిజనులను కలిసి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. రేషన్ వాహనాలు లేకపోవడం వల్ల పడుతున్న యాతనను గిరిజనులు ఆమెకు వివరించారు. – కొత్తూరు, సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

చిన్నారితో రావాల్సి వస్తోంది

గొట్టిపల్లి జీసీసీకి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న డెప్పిగూడ నుంచి బిడ్డను మోసుకుంటూ వచ్చాను. బియ్యం, బిడ్డను మోసుకుంటూ వానలో నడవడం కష్టమైంది. - వసర భాగమ్మ, డెప్పిగూడ, కొత్తూరు మండలం



క్లుప్తంగా

ఉద్యానంలో కొబ్బరి తోటల పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు: పూండి ఉద్యానం ప్రాంతంలో కొబ్బరితోటలను శుక్రవారం జాతీయ కొబ్బరి అభివృద్ధి సంస్థ(కోయంబత్తూరు) డైరెక్టర్ ఇ.అరవేజ్, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.జయకుమార్, ఎస్.కుమార్‌వేలు(కొచ్చిన్) పరిశీలించారు. పల్లివూరు, రెయ్యిపాడు, అమలపాడు గ్రామాల్లో కొబ్బరి పునరుద్దరణ పథకం, ఎల్‌ఓడీపీల అమలును పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రామ్మోహన్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.చిట్టిబాబు, మండల ఉద్యానవన శాఖ అధికారులు కె.సునీత, సీహెచ్.శంకర్ దాసు, రైతులు పాల్గొన్నారు.

'ఆదిత్య'కు రూ.15 లక్షలు మంజూరు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో వినూత్న ఆలోచనలకు వేదికగా ఉన్న ఇంక్యుబేషన్ కేంద్రానికి కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఆటోమేటెడ్ బ్యాటరీ చార్జింగ్ సిస్టమ్ ఫర్ ఈ–వెహికల్స్ అనే ఆలోచనను తక్కువ ఖర్చుతో రూపకల్పన చేయడానికి ఈ నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు రత్నాల అలేఖ్య, సాధు ఉమా చంద్రసాయి, ఊన ప్రవల్లిక, కొండాల దిలీప్‌కుమార్, ఎ.జ్యోత్స్న, ఎం.నిరంజన్ తదితర విద్యార్థులంతా అధ్యాపకులు జి.సతీష్ కుమార్, పల్లి శ్రీహరి, డి.విష్ణుమూర్తి తదితరుల ఆధ్వర్యంలో ప్రాజెక్టుకు రూపకల్పన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ట్రిపుల్‌ఈ హెచ్‌ఓడీ విజయకుమార్, ఈసీఈ హెచ్‌ఓడీ అశోక్, మెకానికల్ హెచ్‌ఓడీ పి.శ్రీహరి విద్యార్థులను అభినందించారు.

అధిక దిగుబడి వల్లే ధరల తగ్గుదల




మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: చిత్తూరు జిల్లాలో 6.5 మెట్రిక్ టన్నుల మేర తోతా మామిడి పంట పంట దిగుబడి రావడంతో ధరలు తగ్గాయని, అయినా ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం టెక్కలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద రైతుల కోసం రూ.89 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఈ ఏడాది వరి అధికంగా దిగుబడి వచ్చిందని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో వారి ఖాతాలకు డబ్బులు జమ చేశామని మంత్రి తెలిపారు. అనంతరం టెక్కలి చిన్నబజారులో ఆధునీకరించిన ఫిష్ మార్కెట్‌ను మంత్రి ప్రారంభించారు.

టెక్కలి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి సస్పెన్షన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రేషన్ డీలర్లకు సకాలంలో సరుకులు చేరవేయలేదన్న కారణంతో టెక్కలి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి పి.నానిబాబును జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో టెక్కలి సీఎల్‌డీటీ కె.అనిల్ పాత్రోకు తాత్కాలిక బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం ఉందని, వారిని కాకుండా అన్యాయంగా ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిని బలి చేశారని రెవెన్యూ, సివిల్ సప్లయ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మూడు నెలలుగా సరుకులు ఆలస్యంగా రేషన్ డిపోలకు చేరుతున్నాయని, స్టేజ్–1, స్టేజ్–2 వాహనాలు సరిగా సేవలు అందించడం లేదని నానిబాబు పలుమార్లు కార్పొరేషన్ డీఎంకు తెలియజేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని, ఆయన నిర్లక్ష్యం నానిబాబుకు శాపంగా మారిందని పలువురు సిబ్బంది అంటున్నారు.

వైన్‌షాపు వద్ద గుర్తు తెలియని మృతదేహం



యువకుడి మృతదేహం

శ్రీకాకుళం రూరల్: సింగుపురం పరిసర ప్రాంతంలోని ఓ వైన్‌షాపు వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం లభ్యమయ్యింది. ఈ వ్యక్తి రెండు రోజులుగా ఇదే ప్రాంతంలో తాగుతూ తిరిగే వాడని స్థానికులు చెబుతున్నారు. సుమారు 35 ఏళ్ల వయసు కలిగి నలుపు టీషర్ట్, జీన్స్‌ప్యాంట్ ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు.

పోడు పంటలకు ముప్పు



టెక్కలి మండలం గూడెం వద్ద కొండపై యంత్రాలతో కంకర తవ్వకాలు చేస్తున్న దృశ్యం

- గూడెం కొండపై విచ్చలవిడిగా కంకర తవ్వకాలు
- పోడుపంటలు నాశనం కావడంతో గిరిజన రైతుల ఆందోళన
- ఇదే కొండపై వన్యప్రాణుల ఆనవాళ్లు



పోడు పంటలు నాశనమవుతున్నాయని చూపుతున్న గిరిజన రైతు

టెక్కలి: ఇష్టారాజ్యంగా సాగుతున్న కంకర తవ్వకాలతో పోడు పంటలకు ముప్పు వాటిల్లుతోంది. టెక్కలి మండలం గూడెం గ్రామాన్ని ఆనుకుని ఉన్న కొండపై కొన్నాళ్లుగా విచ్చలవిడిగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో తమ జీవనాధారమైన పోడు పంటలు నాశనమవుతున్నాయని సవర సీతాపురం గ్రామానికి చెందిన గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామానికి చెందిన గిరిజనులకు ఇదే కొండపై పోడు వ్యవసాయానికి సంబంధించి పట్టాలు అందజేశారు. దీంతో వారంతా జీడి, మామిడి పంటలు వేసుకున్నారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరుగుతున్న సమయంలో కొందరు అక్రమార్కులు కొండపై విచ్చలవిడిగా కంకర తవ్వకాలు చేపడుతున్నారు. భారీ యంత్రాలతో తవ్వకాలు జరుగుతుండటంతో పంట మొక్కలు నాశనమవుతున్నాయని, తమకు జీవనాధారం లేకుండా చేస్తున్నారని గిరిజన రైతులు వాపోతున్నారు.

పోర్టు పేరిట..

మూలపేట పోర్టుకు కంకర తరలింపు పేరుతో గూడేం కొండను పూర్తిగా మైదానంగా మార్చేశారు. నందిగాం మండలం సొంటినూరు రెవెన్యూ పరిధిలో ఉన్న ఇదే కొండపై గతంలో వన్యప్రాణులు సంచరిస్తూ ఉండేవి. ఇదే ప్రాంతం నుంచి గతంలో దుప్పిలు, జింకలు, కొండ గొర్రెలు, నెమళ్లు దారి తప్పి సమీప గ్రామాలకు వచ్చిన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటి కొండపై చేస్తున్న కంకర తవ్వకాలతో ఒక వైపు గిరిజన రైతులకు, మరో వైపు వన్యప్రాణులకు ముప్పు వాటిల్లుతోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

నాశనం చేస్తున్నారు...



గూడెం కొండపై గతంలో మాకు పోడు వ్యవసాయానికి పట్టాలు ఇచ్చారు. దీనిపై జీడి, మామిడి పంటలు సాగు చేస్తున్నాం. ఇప్పుడు కంకర తవ్వకాలు చేస్తుండటంతో మొక్కలు నాశనమైపోతున్నాయి. మా పంటలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– చందనగిరి కృష్ణారావు, గిరిజన రైతు, సవర సీతాపురం, టెక్కలి మండలం

పోడు పంటలే దిక్కు..



మా గ్రామస్తులకు కొండపై ఉన్న పోడు పంటలే దిక్కు. అటువంటి పంటలను నాశనం చేసే విధంగా కంకర తవ్వుతున్నారు. దీనిపై ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నాం.

– ఐ.రజని, సవర సీతాపురం, టెక్కలి మండలం

స్కూల్ ఆటో బోల్తా

- ఆరుగురు విద్యార్థులకు గాయాలు
- ఈదులవలస మోడల్ స్కూల్‌కు వెళ్తుండగా ఘటన



ప్రమాదానికి గురైన ఆటో



తీవ్రంగా గాయపడిన విద్యార్థి శ్యామ్‌చరణ్

నరసన్నపేట: దేశవానిపేట సమీపంలో పోలాకికి వెళ్లే దారిలో ఆర్అండ్‌బీ రహదారిపై స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటో టైర్‌పంక్చర్ కావడంతో అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈదులవలస మోడల్ స్కూల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో శ్యామ్‌చరణ్(ఇందిరానగర్), కె.కామేశ్వరి(పిరువాడ), జి.గుణశ్రీ (రాళ్ల గోదాయవలస), సీహెచ్ కుసుమ కావ్య(పిరువాడ), వి.జాగృతి(జమ్ము), వై.గీతా శ్రీ (పిరువాడ) గాయపడగా.. నలుగురు విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. శ్యామ్‌చరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో నరసన్నపేట ఆసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు.జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పైడి ప్రవీణ విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

నేరాల నియంత్రణకు తనిఖీలు



చౌదరి సత్యనారాయణ కాలనీలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



జె.ఆర్.పురం పంచాయతీలో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైమ్: నేరాల నియంత్రణ, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టే చర్యల్లో భాగంగా శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు శుక్రవారం నగరంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఈశ్వరరావు సిబ్బందితో కలిసి చౌదరి సత్యనారాయణ కాలనీలో తనిఖీలు చేశారు. గంజాయి, మద్యం, నాటుసారా, నిషేధిత పదార్థాలు, అక్రమ నిల్వలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

రణస్థలం: నేర నియంత్రణ, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు అరికట్టే చర్యలలో భాగంగా జె.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. పత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో జే.ఆర్.పురం, లావేరు, జి.సిగడాం ఎస్సైలు ఎస్.చిరంజీవి, లక్ష్మణరావు, మధుసూదనరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బంది

జెమ్స్‌లో ఉచిత శస్త్రచికిత్సలు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గ్రహణం మొర్రి, అంగులీకానికి శనివారం నుంచి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ హేమంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, ఎన్టీఆర్ వైద్యసేవా కార్డు/తెల్లరేషన్ కార్డు తీసుకొచ్చి సంప్రదిస్తే ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించుకోవచ్చని, వివరాలకు 7680945332 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి శివారులో శుక్రవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని చెప్పారు. సుమారు 45 ఏళ్లు కలిగిన ఈ వ్యక్తి ఎరుపు బనియన్, నలుపు షార్ట్ ప్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు 9493474582 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎటువంటి పోరాటాలకు పిలుపునిచ్చినా ఆర్టీసీ ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని ఈయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.నానాజీ, జోనల్ అధ్యక్షుడు కె.జె.సుభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో ఈయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారా నిర్వహించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఆర్టీసీలో నియామకాలు చేపట్టాలని, ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని, విశ్రాంత ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, పాతపద్ధతిలోనే వైద్య సదుపాయాలు కల్పించాలని, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిరసన కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.త్రినాథ్, కె.దశరథ, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల నాయకులు జి.బి.మూర్తి, ఎస్.వి.రమణ, బి.రామకృష్ణ, కె.బాబూరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న ఈయూ ఉద్యోగులు

నిధుల్లేవు.. అభివృద్ధి ఎలా..?



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

ఇచ్ఛాపురం రూరల్: పంచాయతీలను అభివృద్ధి చేద్దామంటే ఇప్పటి వరకు మంజూరు చేయాల్సిన 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరు చేయలేదు, ఇక అభివృద్ధి చేయమంటే ఎలా అంటూ మండల సర్పంచ్‌లు ఎంపీడీఓను నిలదీశారు. శుక్రవారం ఎంపీపీ బోర పుష్ప ఆధ్వర్యంలో మండలంలోని 21 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు ఎంపీడీఓ కె.రామారావుకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయడానికి, వీధి దీపాలు వేసేందుకు, కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ వేసేందుకు పంచాయతీలో 'జీరో' నిధులు కావడంతో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన తనయ



పాతటెక్కలిలో తల్లికి తలకొరివి పెడుతున్న కుమార్తె సంతోషికుమారి

వజ్రపుకొత్తూరు: పాత టెక్కలిలో శుక్రవారం తల్లికి తలకొరివి పెట్టిన హృదయ విదారక ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుగ్గిలాపు భాగ్యలక్ష్మీ (60) కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. భర్త 30 ఏళ్ల కిందటే మృతిచెందగా.. కుమార్తెలు సంతోషికుమారి, నాగమణిలకు వివాహాలు జరిగాయి. తల్లి అనారోగ్యానికి గురైనప్పటి నుంచి పెద్ద కుమార్తె సంతోషికుమారి పాత టెక్కలి వచ్చి తల్లి బాగోగులు చూసుకుంటోంది. భాగ్యలక్ష్మి ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం మృతిచెందింది. దీంతో కుమార్తె సంతోషికుమారి అన్నీ తానై తల్లికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది.

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట: జలుమూరు మండలం రాణ, రామకృష్ణాపురం గ్రామాల్లో జరిగిన రెండు చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. ఈ రెండు కేసుల్లోనూ నిందితుడు ఒకరేనని సీఐ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం నరసన్నపేట సర్కిల్ స్టేషన్ వద్ద విలేకరులకు వెల్లడించారు. జలుమూరు మండలం యాళ్లపేటకు చెందిన మద్దు మాధవరావు 2023 మార్చి 6న రాణ గ్రామం మెయిన్ వీధిలో తాళం వేసి ఉన్న కొంగరాపు పుణ్యవతి ఇంట్లో చొరబడ్డాడు. స్క్రూ డ్రైవర్ సహాయంతో బీరువా తెరిచి రెండు తులాల బంగారు గొలుసు, తులమున్నర పుస్తెలతాడు చోరీకి పాల్పడ్డాడు. 2024 ఆగస్టు 27న రామకృష్ణాపురంలో తాళం వేసి ఉన్న మరో ఇంటిలో బీరువా తెరిచి చిన్న పిల్లల బంగారు చైన్లు, చెవి బుట్టలుతో పాటు మొత్తం మూడు తులాల ఆభరణాలు చోరీ చేశాడు. ఈ కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం ఉదయం తిలారు రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా మాధవరావు కనిపించడంతో పట్టుకున్నారు. విచారణ చేయగా నేరాన్ని అంగీకరించాడు. ఇతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. ఇంటర్ వరకూ చదువుకున్న మాధవరావు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సమావేశంలో జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు పాల్గొన్నారు.

లండన్ గడ్డపై ఉద్దానం కీర్తిపతాక

- లండన్ బిజినెస్ స్కూల్లో పీజీ పట్టా పొందిన పిరియా జాగృతి



జాగృతిని అభినందిస్తున్న లండన్ బిజినెస్ స్కూల్ డీన్

కవిటి: ప్రఖ్యాత లండన్ బిజినెస్ స్కూల్‌లో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్(ఎంఐఎం) పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా సాధించిన జిల్లా తొలి యువతిగా కవిటి మండలం బల్లిపుట్టుగకు చెందిన పిరియా జాగృతి రికార్డు సాధించింది. శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌ల కుమార్తె జాగృతి. ఈ ఏడాది దక్షిణాసియాలో భారతదేశం నుంచి లండన్ బిజినెస్ స్కూల్‌లో పీజీ కోర్సుకు 18 మంది అర్హత సాధించగా అందులో జాగృతి ఒకరు. బెంగళూరులో బీబీఏ పూర్తిచేశారు. యూఎస్ బేస్ట్ గోల్డ్‌మెన్ శాక్స్‌లో ఉద్యోగంలో చేరి రెండేళ్లు పనిచేశారు. అనంతరం పారిస్‌కు చెందిన హెచ్‌ఈసీ సంస్థలో మూడునెలల సమ్మర్‌క్రాష్ కోర్సు పూర్తి చేశారు. అనంతరం లండన్ బిజినెస్ స్కూల్‌లో ప్రవేశానికి జరిగిన ప్రవేశపరీక్షలో జీఆర్ఈలో అత్యుత్తమ శ్రేణి ఫలితాన్ని సాధించారు. ఈ మేరకు నిర్వహించిన కాంగ్రిగేషన్ సెర్మోనీలో జాగృతికి సర్టిఫికెట్ ప్రదానంచేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి తల్లి విజయ కూడా పాల్గొన్నారు.

12,13 తేదీల్లో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2025 పోటీలు ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెట్ట అశోక్‌కుమార్ తెలిపారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్ మదీనా శైలానీ అధ్యక్షతన స్థానిక శాంతినగర్‌కాలనీలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అశోక్‌కుమార్ మాట్లాడుతూ సుమారు రూ.2లక్షల నిధులతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. టైటిల్ స్పాన్సర్‌గా శ్రీకాకుళం జీఎస్‌వీ జ్యూయలర్స్ సంస్థ ఎండీ ఊన్న నాగరాజు, కో–స్పాన్సర్‌గా సోలార్ ఎనర్జీ నరసన్నపేట ప్రొప్రైటర్ రైతు షాలిని, సింహాద్రి కన్‌స్ట్రక్షన్స్ ఎండీ జి.భీమారావు క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్‌లను, హైదరాబాద్ మ్యాచ్ పాయింట్ అకాడమీ ఎండీ ముప్పాల వేణు మెమెంటోలు అందిస్తున్నట్లు వెల్లడించారు. అండర్–11, అండర్–13, అండర్–15, అండర్–17, అండర్–19 బాలబాలికలు, స్త్రీ, పురుషులు(సీనియర్స్) విభాగాల్లో పోటీలు జరగనున్నాయని వివరించారు. విజేతలను రాష్ట్రపోటీలకు పంపించనున్నట్లు బ్యాడ్మింటన్ జిల్లా సీఈఓ సంపతిరావు సూరిబాబు తెలిపారు. 94402 55255, 83285 14385 నంబర్లను సంప్రదించి వివరాలు నమోదుచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీఎస్‌వీజే శ్రీకాకుళం బీఎం పాండవ ధర్మా, బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు గోర అనిల్ కుమార్, గురుబెల్లి ప్రసాద్, మెండ శాంతికుమార్, ఎంఈ రత్నాజీ, కంచరాన వైకుంటరావు, మనోహర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మొక్కలు నాటి సంరక్షణ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డ్వామా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బీ, పంచాయతీ రహదారుల వెంట మొక్కలు నాటి వాటికి సంరక్షణ చేయాలన్నారు.

టెక్కలిలో జంగిల్ క్లియరెన్స్ చేసి మొక్కలు నాటినట్లు మండలాల్లో కూడా జంగిల్ క్లియరెన్స్ చేసి మొక్కలు నాటాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు, ఉద్యానవన శాఖకు సంబంధించిన సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. చేపల వేట విరామ సమయంలో మత్స్యకారులకు జాబ్ జారీ చేసిందీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ బి.సుధాకర్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎవరికి నిర్దయించిన పనులు వారు సత్వరమే నిర్వహించి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ బి.సుధాకర్, ఏపీడీలు పి.రాధ, శైలజ, శ్రీనివాసరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఫీల్డ్ ఆఫీసర్లు, డ్వామా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాగావళి తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని దమ్మలవీధి సమీపంలో నాగావళి నదీ తీరాన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం 10.50 గంటలకు దమ్మలవీధి వాటర్ ట్యాంకు వెనుకభాగంలోని నాగావళి నది ఇసుక తిన్నెలపై మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తెలుపు షర్టు, ఆకుపచ్చ జీన్స్ షార్టు ధరించి పొడవైన జుట్టుతో ఐదారు రోజులు నీటిలో ఉండటం వల్ల ముఖం గుర్తించలేనంత పాడైనట్లు పోలీసులు తెలిపారు. జేబులో కళ్లద్దాలు, కుడికాలికి నీలం రంగు బెల్టు చెప్పు ఉందని చెప్పారు. దమ్మలవీధి వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. వివరాలు తెలిసిన వారు 6309990814 నంబర్‌కు తెలియజేయవచ్చని శ్రీకాకుళం రూరల్ సీఐ పైడపునాయుడు తెలిపారు.

కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన మేకపిల్లలు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం దుప్పిలపాడు గ్రామంలో గురువారం రాత్రి వీధి కుక్కలు దాడిచేసి సుమారు 10 మేక పిల్లలను చంపేశాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. దుప్పిలపాడు గ్రామానికి చెందిన సబ్బి లక్ష్మణరావు, బి.సింగి కి చెందిన 13 మేకపిల్లలను ఒక పాకలో ఉంచారు. గురువారం రాత్రి గ్రామంలో తిరిగే వీధి కుక్కలు ఆ మేక పిల్లలపై దాడికి పాల్పడ్డాయి. దీంతో ఆ మందలోని 10 మేకపిల్లలు అక్కడికక్కడే మృతిచెందాయి. మిగిలిన మూడు మేకపిల్లలు తీవ్ర గాయాలకు గురైనట్లు బాధితులు తెలిపారు. మృతిచెందిన మేక పిల్లల విలువ సుమారు రూ.80వేలు వరకు ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

రెండు కేజీల గంజాయితో వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి చెన్నైకు 2.150 కేజీల గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు పట్టుకున్నట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. గంజాం జిల్లా దిగపొహండి బ్లాక్ బోనమాలి గ్రామానికి చెందిన ఖిరాసింధునాయక్ తప్తపాణి ప్రాంతంలో శరత్ అనే వ్యక్తి వద్ద రూ.5వేలకు గంజాయి కొనుగోలు చేశాడు. చెన్నైలో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో పట్టుబడ్డాడు. ఇతని వద్ద నుంచి 2.150 కేజీల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పట్టణ ఎస్సై ముకుందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.